


డి. హనుమంతరావు



*భార్యా భర్తలలో అధికులు ఎవరు? ధర్మశాస్త్రం మాట ఎలా ఉన్నా ఇది గడ్డు సమస్య. పరిష్కారానికి అతీతమైనదీను. దీనికి ప్రేమతో నిమిత్తం లేదు; ఉండదు. ఆత్మగౌరవానికి భంగకరమైన దానిని కూడా ప్రేమించిన హృదయం ఒకప్పుడు అంగీకరిస్తుంది. కాని, ఎల్లప్పుడూ కాదు.*

---

ఆకాశంనిండా నల్లటి మేఘాలు ముసురుకున్నాయి. క్రితం రోజు సాయంకాలం నుంచీ ఒకటే వరసను చినుకుతూంది. వాన పెద్దదవదు, చినుకులు తగ్గవు. అదోకరకం అవస్థ. అంతలో ఆకాశం తెల్లపడి వెలుగు ఆవరించుకుంటుంది. వెంటనే మరో కారుమబ్బు వెలుగు స్థానంలో చీకటిని ప్రవేశపెడుతుంది. ఏమీ తోచని, ఏమి చేయడానికీ పాలుపోని జడత్వం లోకమంతా నిండింది.

జానకి మనస్సులోనూ అలాగే ఉంది. ముందుగది సోఫాలో వాలి ఎదురుగా స్తబ్దంగా నిలబడ్డ చెట్టు ఆకుల్ని రెప్పార్పకుండా చూస్తూంటే, ఆమె మనస్సులో ఎన్నో తలపుల గాలి వానలు చెలరేగి వెలిసిపోతున్నాయి. ఆమె కళ్లలోని నిశ్చలత, వెలుగో, చీకటో, ఆనందమో,

దుఃఖమో తెలియని దిగ్భ్రమను వెలిబుచ్చుతూంది.

జానకి మనస్సులో గత దినాల సంఘటనలెన్నో—ఆమె నమితంగా సంతోషపరిచినవీ, గాయపరిచినవీ—ముళ్ళు తిరుగుతున్నాయి. ఆ రోజుల పరిస్థితులు, సంగతులు, అనుభవాలు

## జి గీ ష

తనవి కానట్టు జ్ఞప్తికి తెచ్చుకొని ఊహించుకుంటూంటే, ఏదో చిత్రాన్ని చూస్తున్నట్టుంటుంది.

అప్పట్లో జానకి ఇంగ్లీషు ఆనర్సు చదువుతూండేది. మొదట్నుంచీ ఆమెకు సాహిత్యంలో అభిరుచి ఎక్కువ. సముద్రం ఒడ్డున రాళ్ల గుట్టలపైన కూర్చుని తన చుట్టూ తెల్లటి నురగను జేరవేసే కెరటాల మధ్య ఏ షెల్లీనో, కృష్ణశాస్త్రినో, నందూరినో చదువుతూంటే




ఈ లోకపు హద్దుల్ని దాటి చాలాదూరం వెళ్ళిపోయేది జానకి. ఏడెనిమిది గంటలప్పుడు తప్పనిసరిగా కొండపైకి ఎక్కుతూంటే, గుండె బరువెక్కినట్టయేది. ఏదో చెప్పలేని బాధ, కారణంలేని బాధ దొలిచేది. చుట్టూ ఉన్న వాళ్ళ వెఱ్ఱికేకలకూ, చెత్త మాటలకూ దూరంగా అగాధమైన ఒంటరితనంలో తను సృష్టించుకున్న ఏ సుదూర స్వర్గాల్లోనో, స్వప్నాల్లోనో విహరిస్తున్న ఆ రోజుల్లోనే...

కృష్ణమూర్తితో పరిచయమైంది. కృష్ణమూర్తి ప్రతి సాయంకాలం ఆరుగంటలప్పుడు తనున్న రాతిగుట్ట ప్రక్కనుంచే నడిచి ఎక్కడికో పైకి వెళ్ళేవాడు. మళ్ళీ గంట తర్వాత తిరిగి వెనక్కు యూనివర్సిటీవైపు నడిచి వెళ్ళేవాడు. తను బీచిలో కూర్చోడం మొదలుపెట్టినప్పట్నుంచీ చూస్తూనే ఉంది. అంతకు ముందెప్పట్నుంచి అతని దినచర్యో అది!

కెరటం దిగజారగానే ఇసకమీద సన్నటి నీటిపొర మిగులుతుంది. ఆ ఇసుక అద్దంమీద కృష్ణమూర్తి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ తల వంచుకుని తన ముందుగా వెళ్ళేవాడు. ఎప్పుడూ మడత నలగని తెల్ల చొక్కా, తెల్ల లాగూ. ఆరడుగుల మనిషతను. ఇసుకలో అతని విగ్రహం కదులుతూ కనబడగానే జానకి అరయింది కాబోలు అనుకునేది. క్రమంగా ఒకరి ఉనికికి మరొకరు అలవాటుపడిపోయారు, ఏమీ మాట్లాడుకోకపోయినా.

అత నేదైనా ఒకరోజు రాకపోతే జానకి మనసు ఊరకే గిలగిల్లాడేది. ఎప్పుడూ మడత నలగని తెల్లస్లాక్, తెల్ల పాంటు, గంభీరంగా తలవంచుకువెళ్ళే అతన్ని చూస్తే ఆమెకు అకారణంగానే జాలిలాంటిది కలిగేది. ఒక్కోసారి నవ్వొచ్చేది కూడ. అత నెవరైనా వేదాంతేమో! లేకపోతే పిచ్చాడా? రెండూ కాకపోతే రోజూ ఒక్కడే అలా మూడు మైళ్ళ పైకి నడిచి వెనక్కు వెళ్ళడమేమిటి?

కృష్ణమూర్తితో పరిచయం చేసుకోవాలని జానకి ఆరాటపడింది. అత నెవడో మామూలు మనిషిలా లేడు. యూనివర్సిటీలోనే చదువుతున్నా తన కేనాడూ కాంపస్‌లో కనబడలేదు. అంతగా ఒంటరితనాని కంకితమైపోడానికి అతని గుండెల్లో ఎన్ని అఖాతాలు, అగ్ని పర్వతాలు దాక్కున్నాయో? వాటన్నిటినీ తరిచిచూసి, వీలైతే అతన్ని ఓదార్చాలనిపించేది తనకు.

ఆమె ఆశించిన ఘడియ త్వరలోనే వచ్చింది. ఓ సాయంకాలం అతని వంకే రెప్పార్పకుండా చూస్తూంటే, ఆ వాడిచూపుల్లో ఏ వేడి స్వాగతాన్నందుకున్నాడో, కృష్ణమూర్తి తిన్నగా ఆమె ప్రక్కకే వచ్చి కూర్చున్నాడు. అతని సాహసానికి ఆమె కొంచెం చలించింది. అయినా, ఆ క్షణంకోసమే ఎదురు చూచిందేమో, మర్యాదగా పలకరించింది.

ఆ తర్వాత కృష్ణమూర్తి తన ఏకాంతానికి స్వస్తి చెప్పాడు. ప్రతి సాయంకాలం ఆమె కూర్చునే చోటుకువచ్చి కూర్చునేవాడు; ఒకో రోజు ఆమెకన్నా ముందు. కృష్ణమూర్తికి సాహిత్యంలో అభిరుచే కాకుండా ప్రవేశం కూడా ఉందని జానకి త్వరలోనే తెలుసుకుంది. అయితే అతను తనకేదీ వచ్చుననుకుని మాట్లాడడు. ఎంతో మామూలుగా, తెలిసీ తెలియనట్టు, అనుమానంతో చెప్పే ఆ మాటల్లో ఎంతటి సాహిత్యపరిచయం, అనుభవం ఇమిడి ఉన్నాయో జానకికి త్వరలోనే అర్థమయింది.

కృష్ణమూర్తిది చాలామెత్తనిహృదయం. ప్రతి చిన్న విషయాన్నీ మనస్సుకు గాఢంగా పట్టించుకునే స్వభావ మతనిది. జీవితంలో దేన్నీ తేలిగ్గా చూడలేడు. తోటివాళ్ల హేళనలకూ, నవ్వులకూ అమితంగా గాయపడిపోయి, వాళ్ల ప్రవర్తనలో, మాటల్లో ఎంతమాత్రం తనకు భిన్నంగా కనబడినా సహించలే డతను. జానకి అతని గురించి ఇలాంటి విషయా లెన్నో తెలుసుకుంది పరిచయ మెక్కువైనకొద్దీ.

కృష్ణమూర్తి లా స్టూడెంటు. హాస్టల్లోనే మకాం. అతని గదిలో ఉండే నలుగు రయిదుగురూ అతని స్వభావానికి పూర్తిగా వ్యతిరేకులు. అసలా చుట్టుప్రక్కల గదుల్లో అతని కతికిన స్నేహితుల్లేరు. ఇంటి దగ్గర్నుంచి డబ్బు మస్తుగా తెప్పించుకుని, విచ్చలవిడిగా ఖర్చుపెడుతూ తిరిగే వాళ్ళే అందరూ. కృష్ణమూర్తి మొదట్నుంచీ డబ్బుతో కొనుక్కున్న సౌఖ్యాన్నెక్కువగా అనుభవించలేకపోయేవాడు. ఎప్పుడూ తనలో తా నాలోచించుకుంటూ, గదిలో మూలగా తను నిర్మించుకున్న గూడుకే అంకితమైపోయిన అతనంటే తోటివాళ్లకు వేళాకోళంగా ఉండేది. వాళ్ళేదైనా ఓమాట అంటే తిరిగి చెప్పలేకపోవడం మాట అటుంచి, తనలో తానే గంటలకొద్దీ వ్యథపడే మనస్తత్వం అతనిది. చుట్టూ ఉన్న వాళ్ల వెకిలి చేష్టలూ, వెఱ్ఱిమాటలూ— ఈ రోతమధ్య దీన్నంతనూ అనుభవిస్తూ మథనపడుతూ దిగులుపడే మూర్తికి సాయంకాలం బీచిలో దొరికే ఆ ఒకటి రెండు గంటల ఏకాంతమే స్వర్గతుల్యమైంది.

జానకితో పరిచయమైనాక, కృష్ణమూర్తికి ఓ వెలుగు కనబడినట్టు తోచింది. ప్రతిరోజూ త నెవరితో మాట్లాడిందీ, ఏం మాట్లాడిందీ, వాళ్లన్న మాటలూ, తనిచ్చిన జవాబులూ అన్నీ ఏకరువు పెట్టేవాడు. తను చెప్పిందీ, చేసిందీ అంతా సబబేనని జానకి భరోసా ఇచ్చిందాకా అతనికి తృప్తి ఉండేదిగాదు.

కృష్ణమూర్తి తన కిస్తున్న ప్రాధాన్యాన్ని చూస్తే జానకికి చాలా వింతనిపించేది. తనెవరు? అత నెవరు? తనేం పెద్ద అరిందానా? తనలో ఏమిటంత విశ్వాసం అతనికి? తనేదో ఒక అపురూప వ్యక్తిలాగ ఎందుకత నూహించుకుంటాడు? అతని బాధలు, కష్టాలు, దుఃఖాలు అన్నీ తనకు



నైరాశ్యం

చిత్రం — వి. రామకృష్ణ గంగరాజు (వాల్తేరు)

చేరేసి తన దగ్గర సానుభూతి పొందితే ఏం ఒలుకుతుం దతనికి?

జానకికి అతని చరిత్ర వింటూంటే చెప్పలేని అనుభూతి కలిగేది. తనలో అతని నమ్మకాన్ని తలచుకొని గర్వపడేది. జీవితంలో ఒక ఒరవడి కలవాటుపడి, అది తప్పి ఎవరైనా నడిస్తే సహించలేని సూటి నడవడి అతనిది. తనలాగే అతనికీ ఒంటరితనమంటే అమితమైన ఇష్టం. కల్మషం, కృత్రిమం లేకుండా సూటిగా హృదయపు లోతుల్లోంచి మాట్లాడే నిజాయితీ అతనిది.

ప్రతి సాయంకాలం అలా కూర్చుని ఆమె దగ్గర తన భావాలన్నిటినీ వెలిబుచ్చుతూ ఆమెతో మాట్లాడుతూంటే ఏదో ఊరట కలిగే దతనికి. జానకికి తను గీసిన బొమ్మలన్నీ చూపెట్టేవాడు. ఆ ఏడు కాలేజీలో జరిగిన చిత్రకళా ప్రదర్శనలో అతనికి ప్రథమ బహుమతి లభించింది. అతనికి చిత్రకళ గురించి పుస్తకజ్ఞానం ఆట్టే లేదు. లేకపోయినా, ప్రఖ్యాత చిత్రకారుల చిత్రాలకూ, అతను గీసినవాటికీ భేదం చాలా తక్కువనిపించేది జానకికి. జానకికి చిత్రకళ గురించి అసలు తెలియదు. అతనేదో చూపించి రంగుల్ని గురించీ, వాటి కలయికల గురించీ ఏదో చెబుతూంటే వింటూండేది—అంతే. అతనంటే ఓమాదిరి గౌరవం ఏర్పడేది.

కృష్ణమూర్తిలా, జానకి ఆనర్సూ రెండూ ఒకేసారి పూర్తయాయి. మూర్తి లాలో అఖండుడు కాదు. మామూలుగానే పాసయాడు. ఏదో డిగ్రీకోసం చదవడమే కాని అతని కందులో పెద్ద అభిరుచిలేదు. జానకి ఆనర్సు ఫస్టు

(తరువాయి 41 వ పేజీలో)

# జి గీ ష

(19వ పేజీ తరువాయి)

క్లాసులో పాసయింది. ఇక తర్వాతేమిటా అన్న ప్రశ్న ఇద్దర్నీ ఎదుర్కొంది. కృష్ణమూర్తి పెద్ద డబ్బున్నవాడుకాదు. తల్లీ తండ్రీ లేరు. పెద్దలు వదిలివెళ్లిన ఏ కొద్దిపాటి భూమి మీదనో ఆధారపడి, ఇక దేనికీ వీలుగాక లా చదివాడు. ఎవరో దూరపు బంధువు లున్నా వాళ్లతో సరిపడక ఏనాడో తెగతెంపులు చేసుకున్నాడు. జానకి తండ్రి కూడా పెద్దగా ఆస్తిపరుడు కాదు. చదువుమీద, కూతురుమీద, కూతురుకు చదువుమీద ఉన్న అభిమానంకొద్దీ చదివించాడే గాని, అతనూ మధ్యతరగతివాడే.

అందుకే, ఆ వేసవికాలం, మామూలుగా తటస్థపడే ఏవిధమైన గొడవలూ లేకుండా వాళ్లిద్దరికీ పెళ్లయింది.

కృష్ణమూర్తికి అప్రెంటిస్ పూర్తిచేసి ప్రాక్టీసు పెట్టాలనే ధ్యాస లేదు. తక్కువ జీతాలిచ్చే ఉద్యోగాలు చేయడాని కిష్టమూ లేదు. అతని దదొకరకం మనస్తత్వం. ఏదైనా చేయబోయేముందు, ముందు వెనక లాలోచించడంతోనే గడిచిపోతుంది కాలమంతా. చివరికి జరిగేదేమీ ఉండదు.

ఉద్యోగం త్వరగా సంపాదించాలనే ఆశతో హైద్రాబాదులో తనంటే కొద్దిగా అభిమానం చూపించిన ఒక స్నేహితుడింట్లో మకాం పెట్టాడు మూర్తి. రోజూ ఎంప్లాయ్‌మెంటు ఎక్స్ఛేంజికి వెళ్లి ఓసారి ప్రదక్షిణంచేసి రావడం అతని దినచర్య. సాయంత్రం టాంక్ బండ్ మీద సిమెంటు కుర్చీలో కూర్చుని దూరంగా నీళ్లమధ్య తనలాగే ఒంటరిగా నిలబడ్డ రాతి బండల్ని చూస్తూ జానకి ఏంచేస్తూందోనని ఊహించేవాడు.

రోజులు గడిచిపోతున్నాయి. పోయి పోయి నెలలుగా మారుతున్నాయి. తను దినచర్య తప్పని సరిగా నెరవేరుస్తున్నా, ఫలితం శూన్యం. తన కన్యాయం జరిగిపోతూంది. తనకు ఉద్యోగం రావడాని కనేక రకాల అడ్డంకులు. అభివృద్ధి చెందిందనుకోబడే ప్రాంతానికి, జిల్లాకి, కులానికి చెందడం ఓ పెద్ద అడ్డంకి. తన కన్యాయం జరిగినా ఫర్వాలేదు. తనతోబాటు జానకి! పెళ్ళి చేసుకోకపోయినా బాగుండును. ఇన్ని నెలలు తండ్రి ఇంటిదగ్గర తన అప్రయోజకత్వానికి ప్రత్యక్ష సాక్షిగా ఉండిపోడం జానకి నెంత బాధపెట్టిందో! కృష్ణమూర్తి తీరిక ఎక్కువైన కొద్దీ విపరీతంగా ఆలోచించేవాడు. ఫలితంగా ఆరని గుండెమంట మాత్రం నిలిచేది.

ఇలా ఉంటున్న రోజుల్లోనే....

ఒక ఉదయాన జానకి పెట్టె, బెడ్డింగుతో ఇంటి గుమ్మం దగ్గర ప్రత్యక్షమయింది. కృష్ణమూర్తి ఊహించని సంఘటన అది. కాని నవ్వు తెచ్చుకుని ఆమెకు స్వాగతం పలికాడు.

జానకి ఎందుకు వచ్చిందీ తెలుసుకున్నాక, కృష్ణమూర్తి చాలా ఆనందపడ్డాడు. తన కింక ఉద్యోగం దొరక్కపోయినా ఫర్వాలేదు. ఇంటి దగ్గర్నుంచి డబ్బు తెప్పించుకుంటూ నిరర్థకంగా రోడ్లవెంబడి తిరగక్కర్లేదు. హొటలు మెతుకులు తప్పిపోయాయి. ఇన్ని సదుపాయాలు ఒక్కసారిగా ఏర్పడ్డం కేవలం తన అదృష్టం అనుకోవాలి. అన్ని సమస్యలూ ఒక్కసారిగా విడిపోయాయి.

"మీకు ఉద్యోగం దేనికి? హాయిగా ఇంట్లో ఉండి బొమ్మలు గీసుకుంటూండండి. నేనూ నేర్చుకుంటాను, నాకూ నేర్పండి. ఉద్యోగమనేది పొట్టకూటికేగదా! పొట్టగడిస్తే ఇంక దాని అవసరమేమిటి? మనిష్ని ఈ ఆఫీసు కాగితాలు, ఫైళ్ళు, ఎర్రటేపులు, అధికారాలు, ఆధిక్యాలు వగైరా కుళ్ళులోంచి దూరంగా ఉంచితే ఎంత ఉన్నత భావాలు కలుగుతాయి! వాటన్నిటినీ రంగుల్లో మలచండి. అంతకన్న జీవితానికి కావలసిందేముంటుంది?" అంది జానకి ఓ సాయంకాలం.

"కాని, జానీ, ఆడదానివి నిన్ను బయటికి పంపి కష్టపెట్టితే, నాకేం మనశ్శాంతి ఉంటుంది చెప్పు" అంటూ గొణిగాడు మూర్తి సగం తనలోనే.

"మరేం ఫర్వాలేదు. కష్టపడ్డాని కే ముందిందులో! రోజుకు రెండు మూడు గంటలు క్లాసులో వాగడమేగా! కాలేజి ప్రక్కగానే ఇల్లు తీసుకుందాం. సుఖంగా గడిచిపోతుంది కాలం. మీరు మీకు చేతనయినదాంట్లో బాగా కృషిచేసి పేరుతెచ్చుకుంటే అంతకన్నా కావలసిందేమిటి చెప్పండి! ఒక ప్రఖ్యాత చిత్రకారుడి భార్యననిపించుకోడం నాకుమాత్రం గర్వంకాదూ! మీ ఔన్నత్యానికి కారణం నా సహకారం అని నలుగురూ చెప్పుకుంటే అంతకన్నా ఆనంద మింకేముంటుంది?"

కృష్ణమూర్తి ఏం మాటాడలేదు. అతని కెంతమాత్రం తెలియనివ్వకుండానే జానకి కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం సంపాదించింది హైద్రాబాద్‌లోనే. ప్రయత్నం చేసి చేసి ఓ చిన్న అందమైన ఇల్లు కాలేజీకి దగ్గర్లోనే చూసుకున్నారు.

జానకికి ఆ రోజులు చాలా ఆనందంగా గడిచిపోయినాయి. తన కలలు పండినట్లయింది. కృష్ణమూర్తీ తనూ గంటలకొద్దీ ఎన్నో విషయాలమీద చర్చించుకునేవారు. కావలసినంత తీరుబడి. పట్నంలో ఉన్న రకరకాల సాహితీ సంఘాల్లో, సాంస్కృతిక సమావేశాల్లో పాల్గొనే వాళ్ళు. జీవితాన్ని మురికినుంచీ, కల్మషంనుంచీ సాధ్యమైనంత పైకి లేపి ఆదర్శాల్ననుసరించి అనుభవించడానికి అత్యుత్తమమైన అవకాశమది.



భగ్నవీణ

చిత్రం—బి. శశి (లేకుసెట్టిపాలెం)

తను చిన్నప్పట్నుంచీ కోరుకున్న, కలలుగన్న స్వర్గాన్ని అరచేతిలో ఉంచుకుని ఆనందపుటంచులు చూసేది జానకి. ఆ కాలంలోనే ఆమె ఎన్నో రచనలు చేసింది తెలుగు, ఇంగ్లీషు రెండింటిలోనూ. ప్రముఖాంధ్ర, ఆంగ్లపత్రికలు ఆమె రచనలను ప్రచురించాయి. ఆమె సాహిత్య విమర్శలను అందరూ మెచ్చుకునేవారు. కాలేజీలో ఆమెకు సాటి మరొకరు లేరనిపించుకుంది.

అతి త్వరలోనే ప్రముఖ రచయిత్రి అయింది జానకి. పత్రికలు ఆమె రచనలకోసం తహతహలాడాయి. కళా సంఘాల్లో, సాహితీ సమితుల్లో ఆమె మాటలు వినాలని ఎందరో చేరేవారు. పేరు ప్రతిష్ఠలు అతి సునాయాసంగా ఆమె పరం కాసాగాయి. పట్నంలోని పెద్ద పెద్ద సాహితీవేత్తలెందరో ఆమె ఇంటి చుట్టూ తిరిగేవారు. రోజూ రాత్రులు చాలాసేపు ఈ పెద్ద మనుష్యులతో చర్చలతోనే సరిపోయేది.

రాను రాను జానకికి తీరికనేది తగ్గిపోయింది. ప్రతిరోజూ ఏదో ఎక్కడో మీటింగు, ఎక్కడో చర్చ, ఏదో ఉపన్యాసం! ఒకోసారి ఊరు వదిలి పొరుగూరు కాలేజీల వారోత్సవాల్లాంటి వాటిలో పాల్గొనడానికి పిలుపులు వచ్చేవి. ఊపిరాడని పని. ఒకటి రెండేళ్లలో జానకి జీవితంలో పెద్ద మార్పు వచ్చేసింది.

జానకి కసలు అంతగా ఆలోచించడానికే తీరికుండేదిగాదు. ఈ రకరకాల వ్యాపృత్తుల మధ్య కృష్ణమూర్తితో మాట్లాడడానికి, కాలక్షేపం చేయడానికి కాలం చాలా తగ్గిపోయింది. కృష్ణమూర్తి మొదట్లో ఈ సారస్వత విషయాలపైన ఎక్కువ ఆసక్తి చూపించేవాడు. కొన్నాళ్ళు ఏవో బొమ్మలూ అవీ గీసేవాడు

కూడ. కాని అతని చిత్రకళను పత్రిక లంతగా ఆదరించలేదు. ఏవో కథలు గూడా వ్రాశాడు. వాటిమీదా సంపాదకు లెవరూ అంతగా దయ చూపలేదు. కొన్నాళ్ళు ఏవో ఉద్యోగాలకోసం తిరిగాడు, జానకి కేం చెప్పకుండానే. అవి అంతగా ఫలించలేదు.

చిట్టచివరి కోనాడు, జానకి తెల్లవారుజామున లేవగానే మూర్తి పక్కమీద లేకపోవడం గమనించింది.తను లేచిన తర్వాత గంటకు ఎంతో బతిమాలించుకొనిగాని లేవని మూర్తి ఆ రోజు అంత పెందలకడే లేవడం ఆశ్చర్యంవేసింది. ఇంట్లోకి వెళ్లి చూసింది. కాని ఎక్కడా మూర్తి లేడు. అతని సామా నేదీగూడా ఇంట్లో లేదు.

ఆ క్షణంనుంచీ జానకి మనసు మనసులో లేదు. పరిపరివిధాల పోయింది. ఊహించుకో లేని ఘోరాన్ని శంకించి ఆమె మనసు ఆరాట పడింది. కృష్ణమూర్తి ఏం ఘోరం తలపెట్టడు గదా ! అదే ఆమెను ప్రతిక్షణం వేధించింది. చెప్పలేని ఆవేదన ఆమె గుండెల్ని కొరుక్కు తింటూంటే ఇంట్లో ఓ మూల దిగ్భ్రాంతితో కూలబడిపోయింది.

తనతో ఎంతమాత్రం చెప్పకుండా అలా వెళ్లిపోడానికి తనేం పాపం చేసిందని ? అతను చెప్పినదాన్నిదేన్నీ కాదనలేదే! అతని స్వేచ్ఛకు అడ్డు రాలేదే ! తనెక్కడికయినా వెళ్లినా అతనితో చెప్పకుండా, అతని అనుమతి తీసుకోకుండా వెళ్లేదికాదు ! అలాంటిది ఇంత హఠాత్తుగా కనీసం ఓ మాటయినా అనకుండా వెళ్లిపోతాడా ? ఊళ్లో ఉన్న కృష్ణమూర్తి స్నేహితు లందరికీ కబురు పంపి అడిగి చూసింది. ఎవరికీ కృష్ణమూర్తి పత్తా తెలియదు.

ఒడ్డూ, అడ్డూ లేకుండా ప్రవహిస్తున్న తన ఆనంద ప్రవంతికి ఆనకట్ట కట్టినట్టయింది. ప్రపంచ మంతా వెక్కిరిస్తూ, వెకిలిగా నవ్వుతూ తనచుట్టూ తిరుగుతూన్నట్టుంది. గడిచిపోయిన రెండు మూడేళ్లు ఏదో పీడకలయినట్టూ, తనీనాటికి కఠోర సత్యాల ముళ్లమీద అడుగుపెట్టినట్టూ అనిపించింది. తనెన్నో గాలిమేడలు కట్టుకొంది. కాలం రేపిన పెను తుఫానుకు ఆ మేడలన్నీ పునాదుల లోతుకు పెద్ద శబ్దంతో కూలిపోతున్నాయి. ఆ మేడలకు తను చెక్కిన నగిషీలను, ఆ గోడలకు తను పూసిన రంగులను చూసి మురిసిపోయింది. కాని ఈనాడు ఆ సమస్తం రాళ్ళూ రప్పల రూపంలో మట్టిలో కలిసిపోయి పొర్లాడుతూంటే జానకికి దిక్కు తోచనట్టయింది.

ఆ సాయంకాలం రాఘవయ్యగా రొచ్చాడు కూతురు బాధలో భాగం పంచుకోవాలని. జానకికి ఆశ్చర్యం వేసింది, సమయానికి ఈయన కూడా రావడం. రాఘవయ్య అంతక్రితం సాయంకాలం కృష్ణమూర్తి వద్ద నుంచి వచ్చిన ఉత్తరాన్ని చూసి గాభరాపడి వచ్చినట్టు తెలియజేశాడు.

# జిగీష

జానకి కంగారుగా ఆ ఉత్తరం అందుకుని చదువుకొంది.

"మీ అమ్మాయి కులాసాగానే ఉంది. మీ అల్లుడు కృష్ణమూర్తి చచ్చిపోయి చాలా రోజులైంది. ఇంక మిగిలింది జానకి మొగుడు మాత్రమే. ఈ జానకి మొగుడు ఎవడైందీ, ఏమైందీ లోకాని కక్కర్లేదు. వాడో బానిస, జీవంలేని అట్టబొమ్మ. ఈ బానిస బ్రతుకు నా కక్కర్లేదు. ఎంత నికృష్టపు బ్రతుకైనా కృష్ణమూర్తిగానే బ్రతకదలచుకున్నాను. బహుశా ఇంక మీ కెవరికీ కనబడను. మీ అమ్మాయి బాధ్యత ఇకమీదట మీపైన ఉంది."

జానకి కళ్లవెంబడి ఒక్కసారిగా కన్నీటి ధారలు కారిపోయాయి. విపరీతమైన దుఃఖం కలిగింది. తండ్రిని చూడగానే ఆమె ఇంతవరకూ వేసుకొచ్చిన కట్ట తెగింది.

"ఊరుకో అమ్మా !" అంటూ ఓదారుస్తూ, కళ్లనీళ్లు పెట్టాడు ముసలాడు.

రాఘవయ్య జానకిని ఇంటికి రమ్మన్నాడు ఉద్యోగం వదిలిపెట్టి. కాని ఆమె కిష్టంలేదు. దుఃఖపుతెర తొలగగానే ఆమె ఓ నిశ్చయానికి వచ్చింది. కృష్ణమూర్తి ఏదో క్షణికావేశంలో వెళ్లిపోయుండొచ్చు. తర్వాతెన్నటికైనా తప్పు తెలుసుకొని ఇంటికి రాకపోడు. తనప్పటి కిక్కడ లేకపోతే, తిరిగి వెళ్లిపోతాడేమో ! పైగా ఇంటి దగ్గర తండ్రికి బరువై ఉండడంకన్న ఆక్కడుండడమే మంచి దనిపించింది. తండ్రినే అక్కడికి మకాం మార్చమంది.

ముందర ఒప్పుకోకపోయినా, తర్వాత రాఘవయ్యగారు అక్కడికే మకాం ఎత్తేయడానికి నిశ్చయించాడు.

• • •

జానకి ఒంటరిగా ఉండడం మొదలుపెట్టి సుమారు అయిదు సంవత్సరాలు కావస్తూంది. ఈ అయిదేళ్లలోనూ కృష్ణమూర్తి ఆచూకీ ఏమీ తెలియనేలేదు. ఊళ్లో ఎవరో స్నేహితులకు ఒక్కసారో, రెండుసార్లో ఉత్తరాలు వ్రాశాడట - జానకి ఆరోగ్యం విషయం తెలపమని, జానకిని ఇలా అడిగినట్టు తెలియజేయవద్దనీను. కాని వాళ్లు నమ్మకంగా ఆ వార్త జానకికి చేరేసేవాళ్లు. ఆమె గుండెల్ని ఎవరో కెలుకుతున్నట్టయేది ఆ క్షణాల్లో. దుఃఖం ఉబికి వచ్చేది. తనంటే ఎంత ప్రేమ కృష్ణమూర్తికి ! ఒక్కరోజు తను కాలేజి నుంచి

> *లత బలహీనమైనది ; కాని మహావృక్షాలను సహితం దృఢంగా బంధించేది అదే.*
>
> —ఇటాలియన్ సామెత

ఆలస్యంగా వస్తే చిన్నపిల్లాడిలా మారాం చేసేవాడు. అసలు కృష్ణమూర్తి తత్వమే అంత.

ఒకోసారి పసిపిల్లాడిలా చుట్టూ తిరుగుతాడు. పెంకితనం చేస్తాడు. అతన్ని చూస్తే తనకు మాతృమూర్తిలా కరుణ కలిగేది. మరోసారి అసలేమీ పట్టనట్లు తనకు దూరంగా తొలగిపోయి ఆలోచనల మధ్య ఇరుక్కునేవాడు. మొత్తానికి అతి సుకుమారుడు అతను. అతని హృదయాని కెంత బలంగా గాయం కలిగించకపోతే అత నలా తనను వదిలి వెళ్తాడు! నిజమేనేమో ! అతను ఇంట్లో ఏ పనీ లేకుండా ఉంటున్నాడని తెలిసీ కూడా తనీ వ్యాపకాలన్నిటినీ తగిలించుకోడమేమిటి ? అత నేమనుకుంటాడో, అతని మనస్సేమవుతుందోనని త నాలోచించిందా ఎప్పుడైనా ? తన సంఘాలు, సమావేశాలు, రచనలు, పత్రికలు ఈ గొడవలన్నిటిమధ్యా అతని సంగతే ఆలోచించడానికి అవకాశం చిక్కలేదు !


తప్పంతా తనదే ననుకొంది జానకి. ముందు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా అన్నట్టు రచనలు సాగించటం మానేసింది. సంఘాల్లో సభ్యత్వం లేదు. ఎవరన్నా పలకరించి చర్చలకూ, సమావేశాలకూ పిలిచినా తిరస్కరించింది. రాను రాను ఆహ్వానాలు తగ్గిపోయాయి. కొన్నాళ్లు ఆమె సంగతే పట్నం సాహిత్య సమావేశాల్లో పెద్ద చర్చనీయాంశం అయింది. ఎవరన్నా ఆల వాటు చొప్పున వస్తూంటారేమోనని, ఎవరితో చెప్పకుండా వేరే ఇంట్లోకి మారింది జానకి. ప్రతి రోజూ కాలేజికి వెళ్లడం, టైముకు తిరిగి రావడం—అంతవరకే. కొన్నాళ్లకు ఆమె సంగతి అందరూ మరిచిపోయారు.

మిగతా అంత సమయంలోనూ ఏదో చదువుతూ, ఆలోచిస్తూ కాలం గడిపేది. దొడ్డివైపు వరాండాలో సోఫామీద కూర్చుని దూరంగా మోడులా నిలచిన ఆచెట్టులుచూస్తూంటే వింత వేదాంతం పుట్టుకొస్తుంది. ఆ చెట్టుకు ఆకుల్లేవు. బ్రతికుందని చెప్పటానికి తగిన ఆధార మేమీలేదు. కాని ఏమో, వానలు పడితేనేగాని దాని అసలు సంగతి తెలియదు. తన పరిస్థితీ అలాగే ఉంది ఇంచుమించు. తనలో జీవం లేదు. "ఇది ముగియబోని ఏ యర్థ మెరుగరాని వేసటలేవి వెర్రి యన్వేషణమ్ము !" అనుకుంటుంది. "ఈ ప్రవాసయాత్రా రతి నెటుల నేను కదలిపోవుదు నా శావకాశములను, ఒక నిట్టూర్పు పోలిక, ఒక్క మౌన బాష్పకణమటు, ఒక గాఢ వాంఛ పగిది."

ఉగాదులూ, ఉషస్సులూ లేని మోడు జీవితమై పోయింది తనది. ఇదంతా తను చేతులారా చేసుకొన్నదేనేమో — అని ఆమె క్రమేపీ నిరాశ వేపు మొగ్గసాగింది.

ఒక రోజు రాఘవయ్యగారు కంగారుగా లోపలికి వచ్చి ఓ కాగితం జానకి చేతిలో పెట్టారు.

"ఏమిటి నాన్నా ఇది !" అంటూ విసుగ్గా తీసుకు చదివింది జానకి. నమ్మలేకపోయింది.



అలంకరణం చిత్రం—టి. ఆనంద్ (కాకినాడ)

పదేపదే చదివింది. అదే! కృష్ణమూర్తికి సన్మానం. సరోజినీదేవి హాలులో. ప్రఖ్యాత చిత్రకారుడు "అనామి" (కృష్ణమూర్తి) కి లలిత కళా సమితి ఆధ్వర్యాన సన్మానం. ఆ తర్వాత మూడు రోజులపాటు అతని చిత్రాల ప్రదర్శనం.

జానకి తన కళ్ళు తాను నమ్మలేకపోయింది. 'అనామి' అంటే కృష్ణమూర్తా? అనామి బొమ్మ లెన్నిటినో ఇంగ్లీషు పత్రికలు ప్రచురించాయి. ఆ మధ్య అతని చిత్రాల ప్రదర్శనం ఒకటి పారిస్‌లో జరుగనున్నట్లు, దాని ప్రారంభోత్సవానికి అతనే స్వయంగా వెళ్తున్నట్లూ పేపర్లలో చదివింది కూడా. ప్రఖ్యాత కళా విమర్శకు లెందరో అతని కళను మెచ్చుకున్నారు. అతను గీసిన బొమ్మల కీనాడు పెద్ద గిరాకీ.

కృష్ణమూర్తి తిరిగి హైదరాబాదు వస్తున్నాడన్నమాట. తనకు జాబు వ్రాయకూడదా? తనమీద ఇంకా అలిగిఉన్నాడేమో! అలా అయితే ఇక్కడికి రావడమెందుకు? జానకి మనసు ఏదీ తేల్చుకోలేకపోయింది. ఆమెకు ఏమీ తోచడం లేదు. బయట వెలుగూ చీకటీ కాని వింత అవస్థ నెలకొంది. ఆమెలో క్షణం విశ్రాంతి వీయకుండా రకరకాల ఆలోచనల కెరటాలు పడిలేస్తున్నాయి. కృష్ణమూర్తి తనను తిరిగి స్వీకరిస్తాడా? ఏమో! తనమీద ఎలాంటి అభిప్రాయంతో ఉన్నాడో! స్తబ్దుగా కూర్చొని పోయింది జానకి.

"బట్టలు మార్చుకో అమ్మా! వెళ్దాం" అన్నారు రాఘవయ్య.

"ఎక్కడికి నాన్నా!" కదలకుండా మరో లోకంలో నుంచి లాగ పలికింది జానకి.

"అదేమిటమ్మా వింతగా మాట్లాడతావు?" ఆశ్చర్యం ఒలకబోశారు రాఘవయ్య.

"వింత కాదు నాన్నా! ఆయన్ను ఇన్నాళ్లకు చూడగానే. . .నేను నిలదొక్కుకోలేను. అంత మంది ఎదుట, వాళ్లందరిలోనూ నేను ఆయనకు ఏదో అయోమయ సన్నివేశాన్ని కల్పించినదాన్నవుతాను. ఆయనకు నామీద ఏ కాస్తయినా అభిమానం మిగిలిఉంటే తప్పకుండా ఇక్కడికే వస్తారు. లేనినాడు, నా రాతలా ఉంటే అలా అవుతుంది" కన్నీళ్లు పెట్టుకుంటూ అంది జానకి.

రాఘవయ్యగారు వినలేదు. వెళ్లక తప్పదన్నారు. అసలు గొడవేమిటో తేల్చుకోవాలన్నారు. జానకి కెంత ఇష్టంలేకపోయినా వెళ్లక తప్పిందిగాదు.

ఆ సాయంకాలం హాలులో చాలా మందే చేరారు. ప్రముఖ కళాకారులు, రాజకీయవేత్తలు, రచయితలు అంతా యథాప్రకారం సమావేశమయారు. వాళ్లందరి మధ్యా వెనగ్గా కూర్చున్నారు జానకి, రాఘవయ్య. కాసేపటికి కారులో కృష్ణమూర్తి దిగాడు. కూడా ఎవరో పెద్దలంతా ఉన్నారు. కృష్ణమూర్తిని చూడ్డానికి అంతా తొడతొక్కిడిగా ఉంది. జనంలో ముందు కొంత మంది లేచి నిల్చున్నారు. జానకి మొగం వాల్చుకుని ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ కూర్చుని ఉంది.

వేదికమీద కాకుండా క్రిందనే కూర్చోబెట్టడంతో కృష్ణమూర్తి సరిగ్గా కనిపించలేదు జానకికి. అంతగా నిలబడాలనే ప్రయత్నమూ చేయలేకపోయింది. కృష్ణమూర్తిని పెద్ద పెద్ద మాటలతో సభకు పరిచయం జేశారు ఓ పెద్ద మనిషి. అలాంటి అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన చిత్రకారుడు ఆంధ్రుడవడం గర్వించతగ్గ విషయం అన్నారు. కృష్ణమూర్తి సభనంతనూ గాలించసాగాడు తొందర తొందరగా.

సన్మానతతంగమయిపోయింది. ప్రదర్శన చూడ్డాని కందరూ ఎగబడ్డారు. జానకికీ, రాఘవయ్యకూ అసలు వీలే చిక్కలేదు. కృష్ణమూర్తి పెద్దలతోకూడ ముందే ఉన్నాడు. కృష్ణమూర్తి తన భర్త అన్న సంగతి వీళ్లలో ఎంతమందికి తెలుసు? తనిలా వెనకగా నిలబడి వాటిని చూసే భాగ్యంకోసం వెదుకాడవలసి వస్తూంది! కాసేపటికి తొందర తగ్గింది.

జానకి నెమ్మదిగా లోపలికి వెళ్లింది. కృష్ణమూర్తి లోపల్నుంచి జానకి రావడం చూశాడు. అతని హృదయంలో చెలియలికట్ట తెగిపోయింది. "జానీ!" అంటూ బావురుమన్నాడు కృష్ణమూర్తి తొందరగా దగ్గరికి వస్తూ. జానకి ఇంక ఆపుకోలేక మొగాన్ని చేతుల్లో కప్పుకుంది. ఇద్దర్నీ దూరంగా తీసుకెళ్లారు రాఘవయ్య. కృష్ణమూర్తికన్నా జానకే ఎక్కువ నిబ్బరం చూపించగలగడం చూసి ఆశ్చర్యపడ్డాడాయన.

• • •

"నా స్వభావం నీకు తెలుసుగా. నీటి బుడగల్లాంటి అనుభూతులు కలవాణ్ణి నేను. ఏదో మూర్ఖత్వంలో వెళ్లిపోవా లనిపించింది. ఇంటికి వ్రాసి భూమ్మీద డబ్బు తెప్పించుకున్నాను. ఇక్కణ్ణుంచి శాంతినికేతన్ వెళ్లి అక్కడే చదివి కృతార్థుణ్ణయ్యాను. స్వతహాగా అభిరుచిగలవాణ్ణేమో, నాకీ చిత్రకళ అభ్యసించడం పెద్ద కష్టమవలేదు. నా సామర్థ్యాన్ని చూసి అక్కడే ఉండిపొమ్మన్నారు వాళ్లు. ఎలాగైనా నీ అంతటి గొప్పవాణ్ణి కావాలనే పట్టుదల నన్ను పీడించింది. రాత్రింబవళ్లు కృషిచేసి ఎన్నో గీశాను. ఫలితం నాకు తెలియకుండానే ఓ సుప్రభాతాన అంతర్జాతీయ ప్రఖ్యాత చిత్రకారుణ్ణయిపోయాను" నవ్వుతూ తేలిగ్గా చెప్పేశాడు కృష్ణమూర్తి, ఒళ్లో జానకి జుట్టు సవరిస్తూ.

"పోనీ నాకో ఉత్తరమ్ముక్క రాస్తే ఏం పోయింది?"

"దానికీ ఓ కారణంఉంది. నిన్నొక రోజు సన్మానించడం చూశాను. ఆ రోజిలాగే అందరూ నిన్ను పొగుడుతూంటే వేదికమీద నువ్వుండగా, క్రింద వెనకాలగా నేను నోట్లో వేలుపెట్టుకుని కూర్చోవలసి వచ్చింది. అప్పట్నుంచీ పేరుకొన్న కోరిక, నిన్నూ ఓనాడు అలాగే కూర్చోబెట్టి సన్మానం చేయించుకోవాలనేది ఈనాటికితీరింది." కృష్ణమూర్తి గట్టిగా నవ్వేశాడు.

ఆ తర్వాత కృష్ణమూర్తి ఎంత చెప్పినా వినకుండా జానకి కాలేజి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చింది. ఆమె ఇప్పుడు చిత్రకళ నేర్చుకుంటూందని తెలిసినవాళ్లు, దీంట్లోనూ ఆమె ప్రావీణ్యం సంపాదిస్తే కృష్ణమూర్తి ఇంకెందులో తన ఆధిక్యం రుజువుచేసుకుంటాడని ఆశ్చర్యపోతారు! ★